అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశించారు. నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, డబ్బాలు, ప్రైవేట్ స్తంభాలు తొలగిస్తే రోడ్డు మరింతా విశాలంగా అవుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ రోడ్డు పనులు పూర్తయితే ఫ్లై ఓవర్ నిర్మించడానికి వీలవుతుందన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులకు స్థానిక వ్యాపారులు సహకరించాలన్నారు.

బండ్లగూడ పాఠశాల స్థలం పరిశీలన..

బండ్లగూడలో కూల్చివేసిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించి వెంటనే సమగ్ర దర్యాప్తు చేపటాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉప్పల్ ఎంఈఓ రామారావు సదరు స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులతో మాట్లాడి ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, చిరంజీవి, ప్రశాంత్ గౌడ్, సతీష్ యాదవ్, జంగయ్య, ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జీహెచ్‌ఎంసీ అధికారులు దీపక్,శ్రీనివాస్, గ్రామస్తులు జంగయ్య, సుదర్శన్, సహదేవ్, వెంకటేష్, శ్రీనివాస్‌చారి, రాఘవేందర్, రామారావు పాల్గొన్నారు.

దీపాలు వెలిగించి..బాణాసంచా కాల్చి..

పాఠశాలల్లో దీపావళి సందడి

నాగోలు: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగోలు జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు దీపావళి వేడుకలు నిర్వహించారు. బత్తుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు మన సంప్రదాయాలు సంస్కృతిని తెలియజేస్తాయన్నారు. ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ, బ్యూల, రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.


దీపావళి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆర్‌కేపురంలో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని నారాయణ పాఠశాలలో బుధవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దీపాలు వెలిగించి, బాణాసంచాలు కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం హేమాంబర్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీఎం గోపాల్‌రెడ్డి, ఆర్‌ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ నీరజ, మహేశ్వరి, హీనా, గాయత్రి, శిరీష, రమేష్, స్వామి, స్వర్ణలత, శ్రావణి పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

లింగోజిగూడ: హయత్‌నగర్‌లోని మెగాసిటీ పాఠశాలలో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొమ్మల కొలువులు, దీపాలు వెలిగించి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని నారాయణ పాఠశాలలో బుధవారం దీపావళి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఏజీఎం హేమంబర్ దీపావళి ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా దీపావళి జరుపుకుంటారన్నారు. దీపాల కాంతిలో చీకటిని పారదోలినట్లు, విద్యార్థులు చదువు అనే జ్యోతితో అజ్ఞానమనే చీకటిని తొలగించాలన్నారు. అనంతరం విద్యార్థులు పూజలు నిర్వహించి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఆర్‌ఐ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ భవానీ, కోఆర్డినేటర్ గాయత్రీ దేవి, వైస్ ప్రిన్సిపాల్ సుమారాణి పాల్గొన్నారు.


దీపావళి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు


చిచ్చుబుడ్డి కాల్చుతున్న విద్యార్థులు


నారాయణ పాఠశాలలో దీపావళి వేడుకలు

తాగునీటి కష్టాలు తీర్చండి


స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జలమండలి అధికారులను కోరారు. గత కొన్ని నెలలుగా బెతస్థాకాలనీలో లోప్రెషర్‌తో సరఫరా అవుతుందని ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం కార్పొరేటర్ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పండుగ నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ఎలా అని అధికారులపై మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ వెంట కాలనీవాసులు పృథ్వీరాజు, వెంకటేశ్వర్లు, ధన్‌రాజ్, జనార్ధన్‌రెడ్డి, కుమారి, రమణ ఉన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా


పనులు ప్రారంభిస్తున్న జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: అన్ని రకాల వసతులు కల్పించి ఐఎస్‌సదన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా అని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి భూలక్ష్మీ మాతా దేవాలయం, గోశాల వద్ద రూ. 4.20 లక్షలతో నిర్మించనున్న ఫుట్‌పాత్ పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఐఎస్‌సదన్‌లోని కాలనీలు, బస్తీల్లో పూర్తయిన రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రెడ్డి, అరవింద్ పాల్గొన్నారు.

‘జీఓ 118 పేరుతో ఎమ్మెల్యే మోసం చేశారు’



వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో రిజిస్ట్రేషన్లకు సంబంధించి గత ఎన్నికల సందర్భంగా జీఓ 22ను సవరణ చేయకుండా హడావుడిగా 118 జీఓ తీసుకువచ్చి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రజలను మోసం చేసి గెలిచారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం వనస్థలిపురంలో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్‌గౌడ్, సామ రమణారెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమని కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన సుధీర్‌రెడ్డి తన ఐదేళ్ల పదవీ కాలంలో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించలేక పోయారని అన్నారు. హడావుడిగా తప్పుల తడకగా 118 జీఓ తీసుకువచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందారన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తున్న మధుయాష్కీగౌడ్ పట్ల ఎమ్మెల్యే అనుచితంగా మాట్లాడుతున్నారని, మధుయాష్కీగౌడ్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. పోస్టింగ్‌ల పేరున మధుయాష్కీ గౌడ్ డబ్బులు దండుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరోపించడం హాస్యాస్పదమని, ఆ సంస్కృతి ఎమ్మెల్యే, ఆయన అనుచరులకే ఉందన్నారు. ఈ సమావేశంలో భాస్కర్ యాదవ్, నరసింహాయాదవ్, సదాశివుడు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నగోని రవి, సత్యనారాయణ, దేరింగుల కృష్ణ, శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.

నేడు సదర్ సమ్మేళనం

మన్సూరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు మన్సూరాబాద్ చౌరస్తాలో సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నేత పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. సమీపంలోని పలు ప్రాంతాల నుంచి దున్నపోతుల ఊరేగింపు ఉంటుందని ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరవుతారన్నారు.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం అలకాపురిలోని శృంగేరి శంకర మఠంలో 2వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ఆలయంలో శారదా చంద్రమౌళేశ్వర స్వామికి రోజూ రుద్రాభిషేకం, తులసిపూజ,నర్మద శివలింగ అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

టెండర్ ఖరారు

చైతన్యపురి: కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు, పూజ సామగ్రికి సంబంధించిన టెండర్ ఖరారైనట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి లావణ్య తెలిపారు. దేవస్థానంలో కొబ్బరి కాయలు, పూజ సామగ్రి విక్రయించేందుకు దేవాదాయ శాఖ రంగారెడ్డి సహాయ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన సీల్డ్ టెండర్, బహిరంగ వేలంలో రవి రూ. 1,01,50,000కు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది లక్ష్మి కాంతరావు, వేణుగోపాల్, రమాదేవి, బి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

చంచల్‌గూడ: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సయ్యద్ జాఫర్ అహ్మద్(28) మాదన్నపేటలోని తన ఇంటి ముందు సోమవారం ద్విచక్ర వాహనం పార్క్ చేసి శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే త్వరితగతిన పూర్తవుతాయన్నారు.

కృతజ్ఞతలు

మన్సూరాబాద్: అఖిల భారత పద్మశాలీ సంఘం, మన్సూరాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు గంజి సత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీయులను ఐక్యపరిచి సంఘాన్ని మరింతా అభివృద్ధి పరుస్తానని అన్నారు. మన్సూరాబాద్ సంఘం భవనానికి స్థలం కేటాయించేలా ప్రభుత్వాన్ని కోరుతానని, త్వరలోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, మంత్రులను కలుస్తానన్నారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఫెడ్ ప్రతినిధులు

మలక్‌పేట: దివ్యాంగుల విద్యాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి అన్నారు. మలక్‌పేట సూపర్‌బజార్ లూయిస్ బ్రెయిలీ పార్కులోని యూసీడీ కార్యాలయంలో బుధవారం ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్(ఫెడ్) ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు. అంధులు, బధిరులు, శారీరక, మానసిక, ఇతర అన్ని రకాల దివ్యాంగుల విద్యాభివృద్ధిపై చర్చించారు. దివ్యాంగ విద్యార్థుల సౌకర్యార్థం అనుకూలమైన తరగతి గదులు, వాష్ రూమ్స్, ర్యాంప్ రెయిలింగ్‌లు, స్టడీ మెటీరియల్ తదితర అంశాలు కమిషనర్‌కు విన్నవించినట్లు ఫెడ్ చైర్మన్ గంగారామ్, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం తెలిపారు. ఈ సమావేశంలో మలక్‌పేట యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి, సభ్యులు నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్టు

నాగోలు: పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పల్ కేసీఆర్‌కాలనీ, ఎల్‌బీనగర్ కాకతీయనగర్ కాలనీ, నవోదయ కాలనీ, సరూర్‌నగర్, వీవీనగర్‌కు చెందిన పలువురు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ పక్కనే ఉన్న ప్రశాంత్‌నగర్‌లో కొత్త నిర్మాణ భవనంలో పేకాట ఆడుతున్నారు. సమచారం అందుకున్న ఎస్‌ఓటీ, ఎల్‌బీనగర్ పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి 7 మందిని అరెస్టు చేశామన్నారు.

మోడల్ జిమ్‌ల ఏర్పాటుకు వినతి


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: సైదాబాద్‌లో మోడల్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి బుధవారం జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని రెడ్డిబస్తీ, భూలక్ష్మీనగర్‌లో అధునాతన పరికరాలతో కూడిన వ్యాయామశాలలను ఏర్పాటు చేయాలని వినతిలో కోరగా జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా


లింగోజిగూడలో పర్యటిస్తున్న జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్

లింగోజిగూడ: నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయటంతో పాటు రోడ్ల మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి లింగోజిగూడ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో బుధవారం ఆయన పర్యటించారు. లింగోజిగూడలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గ్లోబల్ హాస్పిటల్ వరకు, సత్యసాయి టెంపుల్ మీదుగా సీఎం రోడ్డు వరకు నూతనంగా రోడ్డు కనెక్టింగ్‌ను ఏర్పాటు చేయాలని, గ్రీన్‌పార్క్ కాలనీ ప్రధాన రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని, ఎస్ఎన్‌డీపీ పనుల ప్యాచ్ వర్కులను పూర్తిచేయాలని, సరూర్‌నగర్ చెరువు ఇన్, అవుట్‌లెట్‌లలో పూడిక తీయాలని కార్పొరేటర్ జెడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ.. ఆయా పనులపై సంబంధిత అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఎఎంహెచ్ఓ నగేష్‌నాయక్, డీఈ కార్తీక్, ఎఈ విజయ్‌కుమార్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, గౌస్, నరేందర్, నరేష్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ ఓటర్లు 6,05,646

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కొత్తగా ప్రకటించిన ఓటర్ జాబితా ప్రకారం 6,05,646 ఓటర్లు ఉండగా పురుషులు 3,14,435, మహిళలు 2,91,079, ఇతరులు 132 మంది ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికలో 6,04,763 మంది ఓటర్లు ఉండగా పురుషులు 314,101, మహిళలు 2,90,528, ఇతరులు 134 ఉన్నారు. దాదాపు 883 మంది ఓటర్లు పెరిగారు. ఫారం–6 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 2015, 1265 మందిని ఫారం–7 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అధికారులు జాబితాను ప్రకటించారు. చిరునామా మార్పుల ద్వారా వచ్చిన దరఖాస్తులు 2060 మంది ఉన్నారు. గతంలో నియోజకవర్గంలో 570 పోలింగ్ బూత్‌లు ఉండగా పెరిగి ఓటర్ల తర్వాత 577 బూత్‌లను ఏర్పాటు చేశారు.



రూబెన్.. ఆర్చరీలో అదిరెన్


రూబెన్

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన సదనం బాలుడు రూబెన్ ఈ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. బుధవారం జువైనల్ డిపార్టమెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీ బేగ్ బాలుడిని అభినందించారు. తమ సదనం బాలుడు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. రూబెన్ నవంబర్‌లో గుజరాత్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లోనూ పాల్గొంటాడని ఆయన తెలిపారు.

సదర్ వేడుకలకు ఆహ్వానం

చంచల్‌గూడ: దీపావళి పురస్కరించుకుని నవంబర్ 1న ఉప్పరిగూడ యాదవ సంఘం చంచల్‌గూడలో నిర్వహిస్తున్న సదర్ మేళాకు హాజరు కావాలని సంఘం ప్రతినిధులు నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, అజయ్ బుధవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానించారు.

ఓటీఎస్‌తో రూ. 28 లక్షలు వసూలు


హస్మత్ అలీ

చాదర్‌ఘాట్: ఓటీఎస్ ద్వారా జలమండలికి పెండింగ్ బిల్లులు బుధవారం నాటికి రూ. 28 లక్షలు వసూలు చేశామని మలక్‌పేట జలమండలి డివిజన్–1 డిప్యూటీ జనరల్ మేనేజర్ సయ్యద్ హస్మత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దాదాపు 120 మంది వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఓటీఎస్‌లో పెండింగ్ బిల్లులు కట్టనివారి నల్లా కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు.

3న కుమ్మర శాలివాహన సంఘం వనభోజన మహోత్సవం




సాక్షి, సిటీబ్యూరో: కుమ్మర శాలివాహన ప్రజాపతి సంఘం, తూర్పు హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 3న కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నారాయణ, కోశాధికారి సిరసవాడ అంజయ్య పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ఈ వనభోజన మహోత్సవానికి సంఘం తూర్పువిభాగం (ఎల్‌బీనగర్) పరిధిలోని కుమ్మర శాలివాహన కులస్తులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా, ప్రముఖులకు సన్మానం, చర్చా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సన్నాహక సమావేశంలో సంఘం సభ్యులు ఎ.సూర్యనారాయణ, శివప్రసాద్, రమేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన చేయాలి

ఎల్‌బీనగర్: కులగణనను పకడ్బందీగా చేయాలని సర్కిల్–3 డీసీ తిప్పర్తి యాదయ్య అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో చేపట్టే కులగణనకు మూడు సర్కిళ్ల పరిధిలో బుధవారం ఎన్యూమరేటర్లు సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్యూమరేటర్లకు ఎంపిక చేసిన బ్లాక్‌ల వారీగా కులగణను చేయాలని కోరారు. కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల అన్ని వివరాలపై సర్వే చేయాలన్నారు.

ఇంటింటికి కచ్చితంగా వెళ్లాలి..

సైదాబాద్: ప్రభుత్వం నిర్వహించనున్న కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి కచ్చితంగా వెళ్లాలని యూడీసీ పీట గంగుల యుగంధర్‌రెడ్డి సూచించారు. బుధవారం సైదాబాద్ డివిజన్ పద్మావతి కల్యాణ మండపంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వే నిర్వహించే ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇళ్లు కేటాయిస్తున్నామన్నారు. ఎన్యూమరేటర్ తాను పరిశీలించాల్సిన ఇళ్ల జాబితాను సర్వే ప్రారంభం అయ్యే లోపు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలకోపేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఎంసీ మురళీమోహన్, షాబుద్దీన్, మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యుగంధర్‌రెడ్డి


మాట్లాడుతున్న డీసీ యాదయ్య

వికలాంగుల అంశం చేర్చడం అభినందనీయం..

చాదర్‌ఘాట్: త్వరలో జరిగే కులగణన సర్వేలో వికలాంగుల అంశం చేర్చడం అభినందనీయమని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలోని 13వ ప్రశ్నకు ప్రతి వికలాంగుడు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సర్వేతో వికలాంగుల అన్ని రకాల సామాజిక పరిస్థితులు ప్రభుత్వం దృష్టికి వస్తాయన్నారు.

వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ముని

నాగోలు: బాలికలు, మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. బస్టాండ్‌లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. వేధిస్తూ పట్టుబడిన వారిని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ–టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు బుధవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో వేధింపులకు గురిచేస్తున్న 71 మందిలో (మేజర్లు–35, మైనర్లు–36)ను షీ–టీమ్స్ పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 15 వరకు 95 ఫిర్యాదులు అందాయన్నారు. మహిళలు వేధింపులకు గురైతే 8712662111 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ముని, ఆర్ఎస్ఐ ఎస్వీ రాజు, షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.